ఊరగులమారి.

చిలుకూరి దేవపుత్ర



ఆ మరుసటి రోజు జరుగనున్న. పంచాయితీ ఎలక్షనుకు గానూ ఆ సాయంత్రానికల్లా వీరాపురం చేరుకున్నాం. జనరల్ ఎలక్షన్ కయితే తక్కువ సిబ్బందే ఉండేది. అదసలే పంచాయితీ ఎలక్షను అయినందు వల్ల మా ఎలక్షను సిబ్బందే ఓ చిన్నసైజు బెటాలియ నంత ఉంది. అంటే లెక్కప్ర కారం ముప్పయి మందన్నమాట! పోలింగు కేంద్రమైన ఎలిమెంటరీ స్కూలు ముందు ఓ బోరింగు ఉండటంతో అందరం ఒక్కసారి

దానిమీదికి దాడి జరిపాం. ముఖ ప్రక్షాళన కోసం. ఓ అరగంటకి అందరి ముఖాలూ శుభ్రమయి కాంతివంతంగా కనబడసాగాయి.

అప్పటికే పొద్దు కుంకింది. మెలమెల్లగా చీకట్లు ఆ పల్లెనంతటినీ ఆక్రమించుకోవడం ప్రారంభించాయి. మా పోలింగు కేంద్రానికి కరెంటు లేదు. ఊళ్ళో నించి రెండు పెట్రోమాక్స్ లైట్లను మొసుకుని వచ్చారు తలార్లు. ఆ రెండింటిలోనూ మిరుమిట్లు గొలిపే కాంతి ఒక్కదానికీ లేదు. ఒకటి ఉదయించే సూర్యుడిలా ఉంటే మరొకటి అస్తమించబోతున్న సూర్యుడిలా ఉంది.

"మనందరికీ భీమప్ప గారింట్లో భోజనాలు అరేంజి చేశారట" కాసేపటికి అందరం వెళ్ళి భోజనాలు చేసి వద్దాం!" అంటూ అందర్నీ ఉద్దేశించి చెప్పాడు ఎలక్షను ఆఫీసరు.

"ఓకే అలాగే సార్!" అన్నారెవరో మహా ఉత్సాహంగా.

"భోజనానికి వెళ్ళేవరకయినా వర్కు చేసుకుంటాం సార్!" అన్నారు మరెవరో.

"అలాగే సార్! కవర్ల మీద పంచాయితీ పేరు రాయడం బ్యాలెట్ పేపర్ల వెనక సీలు కొట్టడం అవీ పూర్తి చేసుకుంటే భోంచేసి వచ్చాక తక్కిన పనులు చేసుకోవచ్చు!" అన్నాను నేను.

"ఇప్పటికే నీరసంగా ఉంది. భోంచేశాకే ఏ పని అయినా మొదలు పెట్టగలం!" అన్నాడు నీరసంగా మా హనుమంతరాయుడు. అయనా నేను సహోపాధ్యాయులం. నేను తెలుగు టీచర్ని, ఆయన హిందీ టీచరు. నా మూలవేతనం ఆయన మూలవేతనం కంటే తక్కువ కావడంతో ఆయన్ని పోలింగు ఆఫీసరుగానూ, నన్ను అసిస్టెంటు పోలింగు ఆఫీసరుగానూ వేశారు.

మా హనుమంతరాయుడు అన్నది ఎలక్షన్ ఆఫీసరు విన్నారేమో అందుకే -- "భోంచేసుకుని వచ్చాకే పని మొదలు పెట్టవచ్చులెండి.... ఎంతసేపూ.... అనంటూనే కొద్ది దూరంలో నిలుచుని ఏదో బాతాఖానీ కొడుతున్న కానిస్టేబుల్స్‌ని ఉద్దేశించి - "ఏమండీ కానిస్టేబుల్స్! మేం ఒక అరగంటలో భోజనాలు పూర్తి చేసుకుని వచ్చేస్తాం మీరిక్కడే ఉండండి - జాగ్రత్త ఎవర్నీ రానీయకండీ! మీకు భోజనాలని తలారితో ఇక్కడికే పంపే ఏర్పాటు చేస్తాం సరేనా!" అన్నాడు ఎలక్షను ఆఫీసరు. వాళ్ళు 'ఊ' అన్నారో "ఊహూ" అన్నారో కూడా చూడకుండా "ఊ అందరం పోదాం పదండి సార్!" అంటూనే గబగబ అడుగులు వేయసాగాడు. అందరం ఉత్సాహంగా ఆయన్ని అనుసరించాం.

* * *

రెండు పంక్తులు తీరి అందరం ఆవురావురుమంటూ భోం చేస్తున్నాం. మాకు కొద్ది దూరంలో ఘనమైన చెక్క కుర్చీలో హుందాగా కూచుని ఉన్నాడో భీమప్ప.

"సర్పంచు పదవికి ముప్ఫయి అయిదేళ్ళనించీ నేనే పోటీ చేస్తూ పెద్ద మెజారిటీతో గెలుస్తూ వచ్చినాను సార్! గవర్నమెంటోళ్లు ఈసారి మా ఊరి సీటుని షెడ్యూల్డు కులాల వాళ్ళకి రిజర్వు చేసింది కదా.... అందుకే పోటీ చేయడంలేదు." అన్నాడు భీమప్ప. అంతవరకూ మాట్లాడుతున్న

ఎన్ని రిజర్వేషన్లు కల్పించినా దశదిశలూ వివక్షత వ్యాపించిన ఈ వ్యవస్థ ఊడలమర్రి కింద ఏ మొక్కయినా బతుకుతుందా?

వాడల్లా ఆపి భోజనాలు చేస్తోన్న మావంక ఓసారి చూశాడు.

భీమప్ప పేరులోనే కాదు ఆకారంలో కూడా భీముడి లాగానే ఉన్నాడు. మనిషిలో రాజసం ఉట్టిపడుతోంది. నిడుపాటి విగ్రహం, బుర్రమీసాలూ, రోల్డుగోల్డు ఫ్రేమ్ ఉన్న కళ్ళజోడూ, అతని హుందాతనాన్ని రెట్టింపు చేస్తున్నాయి. మెర్క్యూరీ లైట్ వెలుతుర్లో అతని పంచే, చొక్కా మరింత తెల్లగా మెరిసిపోతున్నాయి.

"ఇంతకీ మీ క్యాండిడేట్‌ని చూపనే లేదు!" అడిగాడు ఎలక్షను ఆఫీసరు.

పెళ్ళికి వెళ్ళి పెళ్ళి కొడుకును చూడకుండా ఎవరైనా ఉంటారా? మా ఎలక్షనాఫీసరుకి ఉన్న కుతూహలమే నాకు ఉందాయె మరీ!

"భోజనం అద్భుతంగా ఉంది!" అన్నాడు మా హనుమంతరాయుడు.

నిజానికి భోజనం అతి మామూలుగా ఉంది. కాకపోతే మాకున్న ఆకలీ, అక్కడి కొత్త పరిసరాలూ మా నాలుకలకి గొప్ప రుచుల్ని కలిగిస్తున్నాయి.

"అయితే, కాబోయే సర్పంచుని చూడాలని ముచ్చట పడుతున్నారా? ముందు భోజనాలు కానీయండి! నిదానంగా చూద్దురు గానీ! అన్నాడు భీమప్ప తాపీగా

అందరం భోజనాలు చేసేసి వరండాలో వేసి ఉన్న నల్లకంబళి మీదవచ్చికూచున్నాం."

వరండా ముందున్న గాటి పట్లకు నాలుగు జతల దేశపు ఎద్దుల్ని కట్టేసి ఉన్నాయి. ట్యూబ్ లైట్ల వెలుతుర్లో వాటి కొమ్ములు నిగనిగలాడుతున్నాయి. మమ్మల్ని వింతగా చూస్తూ ఉన్నాయి ఎద్దులు.

పెద్దస్టీలు కంచంలో తాంబూలం ఉంచారు మాముందర. ఇష్టమున్న వాళ్ళు తాంబూలం వేసుకుంటున్నారు. మరికొందరు సిగరెట్లు వెలిగించారు. నేను రెంటినీ సేవించడానికి ఉపక్రమించాను.

అందరితో పాటూ భీమప్ప అక్కడ కూచోలేదు అటూ ఇటూ పచార్లు చేస్తూ ఉన్నాడు.

ఎద్దులకి శెనగపొట్టు వేస్తున్నాడు ఓ జీతగాడు.

"ఏంసార్! ఎలక్షను ఆఫీసరుగారూ! మాకాండేట్ చూడల్లంటిరే! చూడండి మల్ల... అగ్గో వాడే! పేరు ఓబుల్లుగాడు." అన్నాడు భీమప్ప - ఎద్దులకి పొట్టువేస్తున్న జీతగాడిని చూపిస్తూ.

అందరం ఒక్కసారి జీతగాడివైపు చూపులు సారించాము. పాతకాలపు సల్లాడం (నిక్కరుకీ, డ్రాయరుకీ మధ్యస్తంది) చిరిగిన గుడ్డ బనియనూ, చింపిరినెత్తికి మాసిపోయి ఉన్న ఎరుపు గళ్ల తువ్వాలు చుట్టి ఉన్నాడు. వయసు ఏభైలోపే ఉండవచ్చు. లేనితనం వల్లనేమో అతని శరీరం శుష్కించి నల్లగా కమిలి పోయినట్టుంది.

"మీరంతా ఆశ్చర్యపోతున్నారు. అవునా? ఈ గుడ్డి గవర్నమెంటు రిజర్వేషను పెట్టిందే! ఏంజేసేదిమల్ల... ఎవరో మాలామాదిగ నాయాండ్లు? ఓట్లేపిచ్చి గెలిపిస్తే కొమ్ములు మొలుసుకొచ్చి మనల్నే కుమ్ముతారని నాకు బాగా తెలుసు సార్! అందుకే మా జీతగానితోనే నామినేషను ఏపించినా ఎట్లా ఈనాకొడుకు మాలనాయాలే! ఈడయితే మనం యాడుండమంటే ఆడపడి వుంటాడు. చెప్పాలిడిసే జాగాలో కుచ్చోమంటే గమ్మున కుచ్చుం

టాడు..." అంటూ భీమప్ప చెప్పకు పోతు న్నాడు. మా వాళ్ళందరూ నోళ్ళు వెళ్లబెట్టి వింటున్నారు.

ఓబులేసు తన పనిలో నిమగ్నమయి ఉన్నాడు. భీమప్ప మాటలు కానీ, మా మాపుల్నికానీ పట్టించుకునే స్థితిలో లేడు. అతనిలో తర్వాతి రోజు జరుగబోతున్న ఎలక్షన్ టెన్షన్ గానీ, గెలుస్తానా, లేదా అన్న ఆందోళన గానీ, ఆదుర్దాగానీ నామమాత్రం గానైనా లేవు.

భీమప్ప దగ్గర్నించి సెలవు తీసుకుని మళ్లీ పోలింగు కేంద్రానికి చేరుకున్నాం.

నా మనసులో మాత్రం భీమప్ప అన్న మాటలు - "ఎవరో మాలా మాదిగనా యాండ్లకి ఓట్లేపించి గెలిపిస్తే కొమ్ములు మొలుసుకొచ్చి గింగురు మంటున్నాయి. పట్టణ వాతావరణంలోనే పుట్టిపెరిగిన నాకు కులాల అంతరాలు గురించి తెలిసింది తక్కువేనేమో అనిపించింది."

"మొత్తానికి భీమప్ప అసాధ్యుడప్పా! ఈ ఊర్లో ఆయప్పకి మాంచి పలుకుబడి ఉంది. అవతల పోటీచేసే అభ్యర్థికి డిపాజిట్లు గల్లంతయినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు" అన్నాడు మా హనుమంతరాయుడు.

నిజానికి మా హనుమంతరాయుడు పొరపాటున టీచరు అయినాడు గానీ..... ఆయనసలు ఏ ఇంటిలిజెన్స్ డిపార్టుమెంటులోనో ఉండాల్సిన వాడు.

"అప్పడే ఎంక్వయిరీ చేసినావా? అసాధ్యుడప్పా! నువ్వా!" అన్నాను.

పోలింగు ఆఫీసర్లు, పోలింగుక్లర్క్కులూ ఎలక్షన్ మెటీరియల్ని గోనెసంచుల నుంచి బయటికి తీసి బ్యాలెట్ పత్రాల వెనక సంతకాలు చేయడంలోనూ, కవర్లమీద ఎలక్షను వివరాలు రాయడంలోనూ ఉండిపోయారు. మెల్లగా నేనూ కవర్లు తీసుకున్నాను రాసేందుకు.

* * *

పోలింగు ఉదయం ఎనిమిది గంటలకి ప్రారంభమయి ఒంటిగంటతో ముగిసింది. దాదాపు 90 శాతం ఓట్లు పోలయినాయి. మధ్యాహ్నం భోజనం అక్కడికే పంపించాడు భీమప్ప. త్వరగా భోజనాలు చేసేశాం. 2 గంటలనుంచీ ఓట్లలెక్కింపు మొదలయింది.

సాయంత్రం నాలుగున్నర అవుతున్నట్లే ఊరు ఊరంతా మా స్కూలు ముందర నిలబడింది. ఎలక్షను ఫలితాల కోసం.



ఇసుకవేస్తే రాలనంత జనం!
జాతర కొచ్చినంత జనం!!
చెట్ల కొమ్మలమీద జనం!!
చుట్టూ ఉన్న మిద్దెల మీద జనం!!
ఎక్కడ చూసినా జనం - జనం జనం!!!
ఒకటే జనం!!!

ఆడా,మగా, ముసలీ,ముతకా, పిల్లా పెద్దా, అందరూ కలగా పులగంగా అందరి మొహాల్లోనూ ఫలితాలు తెలుసుకోవాలనే ఆత్రం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.

అయిదు గంటలు అవ్వుతున్నట్టే ఎన్నికల ఫలితాలు ప్రకటించారు మా ఎలక్షను ఆఫీసరు. "ఓబులేసు 800 ఓట్ల మెజారిటీతో గెలిచాడు!" అంటూ

జనంలో గొప్ప కోలాహలం చెలరేగింది.

విజిల్స్ చప్పట్లు - వెర్రికేకలు - రెచ్చగొట్టే నినాదాలు మొదలయినాయి!

ఏంచేయాలో తోచని జనం భీమప్పకి 'జై' కొడుతున్నారు!

అంతమంది హర్షధ్వానాలూ, కేరింతలూ మిన్నుముట్టుతున్నా అక్కడ ఎక్కడా ఓబులేసు జాడలేదు - అదేనాకు ఆశ్చర్యం కలిగిస్తోన్న విషయం.

"ఎక్కడండీ? గెలిచిన అభ్యర్థి? రమ్మనండి.... మాకు టైమయిపోతుంది భీమప్ప గారూ! అతను తొందరగా వస్తే సర్పంచుగా ప్రమాణ స్వీకారం చేయించేస్తే అక్కడితో మా పని పూర్తి అయిపోతుంది! అంటూ ఎలక్షను ఆఫీసరు భీమప్పతో అంటున్నాడు."

"వస్తాడు లెండి సార్!" అన్నాడు భీమప్ప అతని మొహంలో తన ప్రత్యర్థి రామానాయుడి క్యాండేట్ ని దెబ్బతీసిన ఆనందం తొణికిసలాడుతోంది.

ఎక్కడినించో రానే వచ్చాడు ఓబులేసు. రాత్రి అతన్ని ఎట్లా చూశానో అచ్చం అట్లానే ఉన్నాడు. కాకపోతే తలకు కొంచెం చమురు రాసి దువ్వుకొని, తువ్వాల్ని భుజాన వేసుకొని ఉన్నాడు. సల్లాడంలోనూ, బట్టబనియన్‌లోనూ పెద్ద మార్పేమీ లేదు.

ప్రమాణ స్వీకారం ఎలా ఉంటుందోనని చూడ్డానికే నేనాగదిలో కాచుకొని ఉన్నాను.

"రండి ఓబులేసు గారూ! లోపలికి!" అంటున్నాడు ఎలక్షను ఆఫీసరు.

అతను గదిలోకి అడుగు పెట్టడం లేదూ, సిగ్గు బడటం లేదు, అలాగని భయపడుతున్నాడని చెప్పడానికీ వీలులేదు. అది తరతరాలుగా అంటరానితనంలో దాగిన పిరికితనమేమో అనిపించింది నాకు.

"నేను బళ్ళోకి రాగూడదు సారూ! అదీగాక అక్కడ మా అయ్య ఉండాడు ఎట్ల సారూ! ఆడిగొచ్చేది! మీరంతా పెద్దోళ్ళు గాబట్టి ఆడ ఉండచ్చు... నేను మాత్తరం ఆడికి రాలేను సామీ! నన్ను ఈడనే ఉణ్ణీయండ్రి!" అన్నాడు ఓబులేసు.

"చూడండి ఓబులేసుగారూ! మనది ప్రజాస్వామ్య దేశం! కులాలకీ, మతాలకీ అతీతంగా ఉండే లౌకిక రాజ్యం మనది. ఇక్కడ పెద్దోళ్ళూ చిన్నోళ్ళూ అన్న తేడాలు ఉండనేకూడదు. అందరూ సమానం ఇక్కడ. తక్కువ కులాల్ని పైకి తేవాలనే ప్రభుత్వం ఇలా రిజర్వేషన్లని పెట్టింది. కాబట్టే మీరు ఎన్నికయినారు. నా మాట విని రండి ఓబులేసుగారూ!" అంటూ ఎలక్షన్ ఆఫీసరు ఓ మినీ లెక్చరిచ్చాడు. చివరి వాక్యం తప్ప ఆ ఓబులేసుకు ఒక్క ముక్క కూడా అర్థమయి ఉండదనిపించింది నాకు.

అందుకే మౌనంగా బిక్కుబిక్కుమంటూ చూస్తూ ఉన్నాడు ఓబులేసు.

"సర్పంచుగా గెలిచాక ప్రమాణ స్వీకారం చేయకతప్పదు పదండీ!" అంటూ అక్కడ ఉన్న పోలింగ్ ఆఫీసర్లంతా చెప్పేటప్పటికి -

"మా అయ్య ఎదురుంగ నేను కూసో వల్లా? నా వల్ల గాదు సామీ! నన్నిడిసి పెట్టండ్రి! నన్నిట్ల బలవంతంజేస్తే ఎట్లు? అంటూ ఏడుపుమొహం పెట్టాడు ఓబులేసు."

"మీరయినా చెప్పండి భీమప్పగారూ! ఆయన్ని లోపలికి రమ్మని!" ఎలక్షను ఆఫీసరు నిస్సహాయంగా చూస్తూ అన్నాడు.

"నేనేంది చెప్పేది! వాన్ని పట్టుకోని అండీ, గుండీ, గారు, గీరూ అంటే ఇంటాడా ఆ మాల నాకొడుకు నేను పిలుస్తాను సూడండి. ఒరేయ్! ఓబుళుగా! రావోయ్!! నీయమ్మ లోపలికి రా!"

భీమప్ప పలుకు వినబడేసరికి ఠక్కున లోపలికి వచ్చేశాడు ఓబులేసు.

"ఏమండీ, ఎలక్షను ఆఫీసరుగారూ! నాదొక్కమాట..." ఈ గది పెద్దదేకదా, ఇంకా చాపలూ, కంబళ్ళూ తెప్పిస్తాను. కింద కూచుని ప్రమాణ స్వీకారం చేయించండి! సరిపోతుంది. అందరికీ సరిపోయేటన్ని కుర్చీలు లేవు కదా!" అన్నాడు భీమప్ప.

ఓబులేసు తనకు ఎదురుగా కుర్చీలో కూచోవడం భీమప్ప సహించలేడని మాకందరికీ అర్థమయిపోయింది.

సారీ అండీ, భీమప్పగారూ! ప్రమాణ స్వీకారం చేయించడం నేలమీద వీలుకాదు, అది సాంప్రదాయం కూడా కాదు. మీరు ఏమనుకోకుండా ప్రేక్షకుల్లో కూచోండి!" అంటూ భీమప్పకి చాప చూపించాడు ఎలక్షను ఆఫీసరు.

కళ్ళల్లో నిప్పులు కురవడం ఎలాగో అప్పుడు చూశాను భీమప్ప కళ్ళల్లో...

మింగలేక, కక్కలేక గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు గుడ్లు మిటకరిస్తూ ప్రేక్షకుల్లో మాముందు కూలబడ్డాడు భీమప్ప.

ప్రమాణ స్వీకారం పూర్తయింది.

ఉపసర్పంచి ఎన్నిక కూడా పూర్తయింది.

జనం అంతా ఎక్కడివాళ్ళు అక్కడే వెళ్ళిపోయారు.

ఇక జరగాల్సిందల్లా ఓట్లు పెట్టెల్నీ, ఎలక్షన్ మెటీరియల్నీ తిరిగి అంతా లారీకి ఎక్కించి మేము బయల్దేరడమే.

అయితే - అక్కడే వచ్చింది చిక్కు!

చావు కబురు చల్లగా చెప్పాడు మాలా రీడ్రెవరు. 'లారీ చెడిపోయిందంటూ'

అప్పటికి ఏడున్నర అవుతోంది.

చీకటి ముసురుకుంది.

మధ్యాహ్నం తిన్న అన్నం ఎప్పుడో అరగిపోయింది.

ఇప్పుడు కడుపులో ఆకలి కేకలు మొదలవుతున్నాయి.

మరో లారీ తేవడానికి పట్నానికి వెళ్ళాలన్నా కూడా సాయంత్రం అయిదు గంటల తర్వాత ఆ ఊరికి బస్సులేదాయె!

ఆరాత్రి భీమప్ప మమ్మల్ని ఎవర్నీ భోజనానికి ఆహ్వానించ లేదు.

* * *

రాత్రి పదిగంటలయింది.

ఆకలితో నిద్దరావడంలేదు. ఊరికే అట్లా కళ్ళు మూసుకుని పడుకున్నాం అంతా!

ఏదో మాటలు వినబడితే లేచి చూశాను.

తలారి చుట్టూ గుమిగూడారు మా వాళ్ళు.

"భలే తన్నిరిలే సారూ! తన్నాటకం అంటే అట్లా ఇట్లా తన్నాటకం గాదులే! వానికి అట్లే జరగాల్సింది!" అంటున్నాడు తలారిరాముడు.

"ఎందుకు తన్నడం?" అన్నాను నేను.

"ఏందిసార్ అట్లాంటావు? భీమప్ప అయ్యంటే ఏందనుకుంటివి ఈ సుట్టు పక్కల పల్లెల్లో ఆయనంటే ఎంతపేరూ ఏంకతా? అట్లా అయ్యముందర కుర్చీలో కుచ్చుంటాడా వాడు? ఆయన పానం ఓర్సుగుంటుందా! అందుకే చెలుకోలు తీసుకోని వాయించి పారేసినాడు అట్ల గొట్టకపోతే ఈడికి కండ్లు నెత్తిమీదికి రావు. మీరు ఏందో చెప్పినారే అనుకోండి. ఆనాకొడుక్కన్నా బుద్ధుండ మన్లేదా?" అంటూ సాధారణమైన విషయంగా చెబుతున్నాడు తలారి.

నా మనసు చివుక్కుమంది.

ఎన్ని రిజర్వేషన్లు కల్పించినా దశదిశలూ వ్యాపించిన ఈ వ్యవస్థ ఊడలమర్రి కింద ఏమొక్కయినా బతుకుతుందా అనిపించింది ఆక్షణంలో.

*

ఫౌల్ ప్లే

దాట్ల దేవదానం రాజు

అంతరంగాలలోని అభిమానం వక్రగీతై
అఘాయిత్యాలు చేయడం ఆట కాదు
ఆటలాడే బొమ్మ విరగ్గొట్టి
చోద్యం చూడటం బాల్య చేష్ట కాదు
ప్రత్యర్థుల గుండెల్లో అగ్గి పుట్టించడమంటే
వెనుక వైపు నుండి వెన్ను చీల్చడం కాదు
అలసట విశ్రాంతిగా సేద తీరుతున్నపుదు
వికృతమైన దురభిమానం మానవత్వం కాదు
సుడులు తిరిగే ప్రవాహాలకైనా
అల్పపీడనపు విసురు తుఫానులకైనా
సంయమనం లేకపోతే భరించలేం
చలాకీ అరుపుల ఆట
టవలు జారి వంగుంటే తప్పిన మరణమైన
పుదు
క్రీడా జ్యోతులను వెలిగించలేం
గాలరీ ప్రోత్సాహ చప్పట్ల నుండి
ఆశయ మందారాలను పూయించలేం
ఒకటిన్నర సెంటీమీటర్ల లోతు గాయం
అసూయాగ్రస్త విపరీత ఉన్మాద ప్రకోపం
క్రీడా స్ఫూర్తి అంటే హుందాగా
ఆటలో గెలవడమే కాదు
ఓడటం కూడ (మోనికా సెలస్
పై దాడి జరిగిన సంఘటన
ఆహ్వానం పత్రికలో చదివి)